క్లుప్తంగా

నేటి నుంచి మూల్యాంకనం

వైవీయూ: ఇంటర్మీడియట్ సమాధాన పత్రాల మూల్యాంకనంలో భాగంగా బోటనీ, జువాలజీ, కామర్స్ సబ్జెక్టుల మూల్యాంకనం ఈ నెల 27వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ఆర్ఐఓ బి. వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. స్పాట్ వాల్యుయేషన్ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఆయా జూనియర్ కళాశాలల జ్ఞానభూమి లాగిన్‌లో ఉంచినట్లు తెలిపారు. అధ్యాపకులు మూల్యాంకనానికి హాజరుకావాలని సూచించారు.

రాహుకాల పూజలు



పూజా కార్యక్రమంలో భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూల మూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు ఈ సందర్భంగా అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు.

తాగునీటి సమస్యను గుర్తించండి

వల్లూరు : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని తహసీల్దార్ అమర్నాథ్, ఈవోపీఆర్డీ ప్రసాద్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో మంగళవారం వైఎస్ ఎంపీపీ జీ లక్ష్మిదేవి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. నాలుగు సంవత్సరాలుగా వర్షాలు సక్రమంగా కురవడంతో తాగునీటి సమస్యలు లేవన్నారు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురిసిన నేపథ్యంలో వేసవిలో నీటి సమస్యలు తలెత్తే అవకాశాలు వున్నాయని, వాటిని ముందుగా గుర్తించి అందరం కలిసి సమష్టిగా పని చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేద్దామన్నారు. వైద్యాధికారులు వేసవి నేపథ్యంలో ఎండల నుండి రక్షించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



చింతకొమ్మదిన్నె : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన కొత్తపేట శ్రీ గంగమ్మతల్లి ఆలయంలో మంగళవారం హుండీ ఆదాయాన్ని ఆలయ అధికారులు లెక్కించారు. ఆలయ చైర్మన్ పీబీ విశ్వనాథరెడ్డి, ఆలయ ఈవో పి.సురేష్ కుమార్‌రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ ఆధ్వర్యంలో హుండీని లెక్కించారు. రెండు నెలలకు సంబంధించి హుండీ ఆదాయం రూ.1,95,650 వచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పుల్లయ్య, ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై మాధవస్వామి



గరుడ వాహనంపై కొలువుదీరిన మాధవ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పెద్దముడియం : పెద్దపసుపుల గ్రామంలో మాధవ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం అర్ధరాత్రి మాధవస్వామి గరుడ వాహనంపై గ్రామంలోని వీధుల్లో దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా సమస్త వాహనాల్లో సర్వ శ్రేష్ఠమైన గరుడ వాహనంపై స్వామి వారిని దర్శించుకుంటే స్వర్గం ప్రాప్తిస్తుందని భక్తుల నమ్మకం.

నేడు రథోత్సవం

శ్రీ మాధవస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి మాధవస్వామి రథోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నామని ఆలయ చైర్మన్ ఎల్.శ్రీనువాసులరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పేదల భవిష్యత్‌ను మార్చేందుకు 'మేమంతా సిద్ధం'



మేమంతా సిద్ధం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, సురేష్‌బాబు



సంఘీభావం తెలుపుతున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

కడప కార్పొరేషన్: పేదల భవిష్యత్‌ను మరింత ఉజ్వలంగా మార్చేందుకు మేమంతా సిద్ధమని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కె. సురేష్‌బాబు, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక అపూర్వకళ్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పి. సంపత్ కుమార్, చైతల్య ఆధ్వర్యంలో 'మేమంతా సిద్ధం' సభకు సంబంధించిన పోస్టర్ లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీ ప్రొద్దుటూరులో నిర్వహించబోయే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మెన్ పులి సునీల్, పార్టీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, సీహెచ్ వినోద్, తోటక్రిష్ణ, దాసరి శివ, బాల క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్రను జయప్రదం చేద్దాం..

జిల్లాలోని ఇడుపులపాయ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టనున్న 'మేమంతా సిద్ధం' బస్సుయాత్రను జయప్రదం చేయాలని వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం. జాషువా పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌టీయూసీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రంగాల్లో పనిచేసే కార్మికులకు మేలు చేసేలా సీఎం వైఎస్ జగన్ పాలన సాగించారన్నారు. ఈ నేపథ్యంలో జరిగే బస్సుయాత్రను కార్మికులంతా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దాసరి నరసింహ, జిల్లా అధ్యక్షురాలు బండి మరియలు, కార్మిక యునియన్ నాయకులు నిర్మల, మోక్ష, షేర్ ఖాన్, మీరా, దస్తగిరి, అబ్దుల్ రౌఫ్, శ్రీధర్, రఫీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యబొమ్మల ప్రదర్శన

కడప కల్చరల్ : లేపాక్షి హస్తకళారూపాల ప్రదర్శనను కడప నగరంలోని లేపాక్షి షోరూంలో నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధి హుసేన్ తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం ప్రదర్శనను ప్రారంభించామని తెలిపారు. ఈ నెల 30వ తేది వరకు ఈ ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ ప్రదర్శనలో కొండపల్లి బొమ్మలు, శెట్టిగుంట రాజు-రాణి బొమ్మలు, వనిపెంట ఇత్తడి, రాగి వస్తువులు, లెదర్ ల్యాంప్ షేడ్స్, కలంకారి బ్యాగులు, పర్సులు ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా కొండపల్లి బొమ్మల్లో పల్లకీలో వధూవరులు, ఏనుగు అంబారి, కృష్ణుడు, గోపికలు, వ్యాసుడు, గణపతి, ఒంటెద్దు బండి లాంటి బొమ్మలు కళ్లు చెదిరే రంగులతో ముచ్చటగొలుపుతున్నాయన్నారు. నగర వాసులు ఈ ప్రదర్శనను తిలకించి అరుదైన ఈ వస్తువులను ఇక్కడే కొనుగోలు చేయవచ్చని తెలిపారు.





నగరంలోని లేపాక్షి షో రూంలో ఆకట్టుకుంటున్న కొయ్యబొమ్మలు

ఆత్మహత్యలపై న్యాయ విచారణ చేపట్టాలి



డీఆర్వో గంగాధర్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న అఖిలపక్ష నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : ఒంటిమిట్ట మండలం మాధవరం గ్రామంలో చోటుచేసుకున్న చేనేత కుటుంబానికి చెందిన వారి ఆత్మహత్యలపై కలెక్టర్ ఆధ్వర్యంలో న్యాయ విచారణ చేపట్టాలని అఖిల పక్ష నాయకులు మంగళవారం డీఆర్వో గంగాధర్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. మృతుని కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడంతోపాటు భూమిని ఆన్‌లైన్‌చేసి పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలన్నారు. ఒక్కొక్క మృతునికి రూ. 25 లక్షలు చొప్పున పరిహారం చెల్లించాలన్నారు. భూ అక్రమాలకు పాల్పడిన అప్పటి తహసీల్దార్, రెవెన్యూ అధికారులను ఉద్యోగాల నుంచి తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, లోక్‌సత్తా నాయకుడు దేవర శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ ఆశీర్వదించండి



కోటూరులో ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, ఆర్‌టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి

వల్లూరు : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్‌ఆర్ సీపీ అభ్యర్థులకు ఓట్లు వేసి జగనన్నను మళ్లీ ఆశీర్వదించడం ద్వారా మరో సారి సీఎంగా చేసుకుందామని కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్‌టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జున రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. వల్లూరు మండల పరిధి కోట్లూరు గ్రామ పంచాయతీలోని కోట్లూరు, బాకరాపురం, బీచువారిపల్లె గ్రామాల్లో వారు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రజలు వారికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు ఇంటింటికీ తిరిగి వైఎస్‌ఆర్‌సీపీ కడప పార్లమెంట్ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి, కమలాపురం అసెంబ్లీ అభ్యర్థి పీ రవీంద్రనాథరెడ్డిలను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. జగన్ మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు ఇంటి వద్దేకే అందుతాయన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే గతంలో మాదిరిగా జన్మభూమి కమిటీలు ఇష్టా రాజ్యంమేలుతాయన్నారు. అందరికీ మేలు చేసే జగన్ సారధ్యంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేసి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, వైఎస్‌ఆర్‌సీపీ నేతలు నాగిరెడ్డి, మస్తాన్, వెంకటసుబ్బారెడ్డి, తాడిగొట్ల అమర్‌నాథరెడ్డి, శివకుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రామకృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, వెంకటరమణారెడ్డి, అంకిరెడ్డి, ఏసయ్య, పుల్లయ్య, నత్తర్‌షా వలి, రఘు, కృష్ణారెడ్డి, ఓబీ సుబ్బారెడ్డి, ఇందిరెడ్డి శంకర్ రెడ్డి, నాగసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



మార్నింగ్ విజిట్‌లో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: కడప నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ అన్నారు. అన్నమయ్య జంక్షన్ నుంచి గోకుల్ జంక్షన్, దేవుని కడప రోడ్, మాచుపల్లి జంక్షన్‌లను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం అల్మాస్‌పేట, వినాయక నగర్ వద్ద నిర్మిస్తున్న గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ పనులను పరిశీలించారు. అన్నమయ్య సర్కిల్ వద్ద ఫౌంటేన్ ఏర్పాటు చేయాలని, క్రిష్ణా సర్కిల్ వరకూ ఏర్పాటు చేస్తున్న డ్రైనేజీకాలువపై స్లాబ్ వేయాలన్నారు. క్రిష్ణా సర్కిల్ నుంచి పొట్టి శ్రీరాములు సర్కిల్ వరకూ ఉన్న డివైడర్ మధ్యలో మొక్కలు నాటాలన్నారు. గోకుల్ సర్కిల్ వద్ద డ్రైనేజీ కాలువలకు కనెక్షన్ ఏర్పాటు చేయాలన్నారు. దేవునికడప రోడ్డులో డివైడర్లలో వీధి దీపాల స్తంభాలను మోడల్ ప్రకారం ఏర్పాటు చేయాలన్నారు. గౌస్ నగర్ పాఠశాల వద్ద నిర్మిస్తున్న కాలువను త్వరగా పూర్తి చేయాలన్నారు. మార్కెట్ యార్డు నుంచి గౌస్ నగర్ వరకూ అప్రోచ్ ఏర్పాటు చేయాలన్నారు. మాచుపల్లి జంక్షన్‌లో ఫౌంటేన్ నిర్మించి, మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించాలన్నారు. రిమ్స్ అండర్ బ్రిడ్జి వద్ద చెత్తను మూడు రోజుల్లోపు శుభ్రం చేయాలన్నారు. శిల్పారామం, సింగపూర్ టౌన్‌షిప్, కేంద్రీయ విద్యాలయం వరకూ ఇరువైపులా ఉన్న చెత్తను శుభ్రం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులు, ఆర్‌అండ్‌బి అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా హుస్సేన్ వల్లి ఉరుసు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని మొయిళ్లకాల్వ గ్రామంలో వెలసిన శ్రీ హజరత్ హుస్సేన్ వల్లి ఉరుసు, శ్రీనారాయణస్వామి ఆరాధన ఉత్సవాలు మంగళవారం దర్గా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి పూజలు చేసి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

ఉరుసు ఉత్సవాల సందర్భంగా ఆలయ అవరణలో బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి ప్రారంభించారు. ముందుగా ఆయన నారాణయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్గాలో ప్రత్యేక పార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పది మూల్యాంకన కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు

వైవీయూ: పదో తరగతి మూల్యాంకన కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరారు. మంగళవారం కడప నగరంలోని డీఈఓ కార్యాలయంలో డీఈఓ ఎం. అనూరాధను కలిసి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున మాట్లాడుతూ ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మూల్యాంకనంలో పాల్గొనే ఉపాధ్యాయులకు చల్లని నీరు, మజ్జిగ తదితర సౌకర్యాలను సమకూర్చాలని కోరారు. పదోతరగతికి పాఠాలు బోధించే ఉపాధ్యాయులను మొదటి ప్రాధాన్యతగా విధుల్లోకి తీసుకోవాలని, సీనియారిటీని దృష్టిలో ఉంచుకుని విధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ పి. శేషగిరిరావు, జిల్లా అధ్యక్షుడు ఎం. గంగరాజు, జిల్లా కార్యదర్శి సురేంద్ర పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయండి



ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు నరేన్ రామాంజులు రెడ్డి

చింతకొమ్మదిన్నె : కమలాపురం నియోజకవర్గంలోని ప్రజలందరూ ఫ్యాను గుర్తుపై ఓటు వేసి కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పి.రవీంద్రనాథ్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీకేదిన్నె జెడ్పీటీసీ సభ్యుడు పి.నరేన్ రామాంజులురెడ్డి ప్రజలను కోరారు. మంగళవారం మండలంలోని ఇపెంట పంచాయతీ పరిధి జమాల్‌పల్లి, బోడెద్దులపల్లి గ్రామాలలో ఆయన ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు ఎక్కడ నిలిచిపోకుండా కరోనా కష్టకాలంలో సైతం అందించిన ఘనత ఒక్క ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. దేశంలో ఏ ఒక్క ముఖ్యమంత్రి చేయని విధంగా కులాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా ప్రతి వర్గానికి సంక్షేమ పథకాలు అందించామన్నారు. మే 13న జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గుడా ప్రభాకర్‌రెడ్డి, కన్వీనర్ కళా యాదవ్, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి, ఏపీ ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కష్ణయ్య, సర్పంచ్ మల్లికార్జునయాదవ్, వర్ధిరెడ్డి సురేంద్రరెడ్డి, సుబ్బరాయుడు, కొత్తపల్లి రాజశేఖర్ రెడ్డి, ఎంపీటీసీలు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవం.. అంకాలమ్మ బ్రహ్మోత్సవం



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

బి.కోడూరు: మండలంలోని మున్నెల్లి గ్రామ సమీపాన సగిలేరు ఒడ్డున వెలసిన అంకాలమ్మ బ్రహ్మోత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా జరిగాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు బి.కోడూరు మండలం నుండే కాకుండా పోరుమామిళ్ల, బి.మఠం మండలాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ధర్మకర్తలు ఓ.ప్రభాకర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ మాధవరెడ్డి, ఉప సర్పంచ్ వెంకటరామిరెడ్డి, బోడుగుండుపల్లెకు చెందిన సుడి బండ్లు భక్తులను ఆకట్టుకున్నాయి. కేశాపురం గ్రామానికి చెందిన నగదు, కుంకుమ బండి పలువురినీ ఆకర్షించింది.

రసవత్తంగా బండలాడుగు పోటీలు

మున్నెల్లి అంకాలమ్మ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన బండలాడుగు పోటీలను ఆలయ ధర్మకర్తలు జగదీశ్వర్‌రెడ్డి, ఓ.ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో ప్రకాశం జిల్లా కొండపేట గ్రామానికి చెందిన కశయ్యకి చెందిన వృషభాలు బుసిరెడ్డి రాజనారాయణరెడ్డి అందజేసిన రూ.40,116లు మొదటి బహుమతిని, నంద్యాల జిల్లా మూడురాళ్లపల్లె గ్రామానికి చెందిన పులిచిన్న ఓబుల్‌రెడ్డికి చెందిన వృషభాలు సి.నాగేశ్వర్‌రెడ్డి అందజేసిన రూ.20,116ల రెండవ బహుమతిని, కడప జిల్లా నారసపురం గ్రామానికి చెందిన కామినిప్రతాప్‌రెడ్డికి చెందిన వృషభాలు బోరెడ్డిచెన్నారెడ్డి అందజేసిన రూ.10,116ల మూడవ బహుమతిని గెలుచుకున్నాయి. ఈ బహుమతులను ఆలయ ధర్మకర్తల చేతుల మీదుగా వృషభ యజమానులకు అందజేశారు.

కేంద్ర కారాగారం సందర్శన



కడప కేంద్ర కారాగారంలో ఖైదీల కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న జడ్జి బాబా ఫకృద్దీన్

కడప అర్బన్: కడప నగర శివార్లలోని పురుషుల కేంద్ర కారాగారం, లీగల్ ఎయిడ్ క్లినిక్, ప్రత్యేక మహిళా కారాగారంను మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ సందర్శించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఖైదీల కుటుంబసభ్యుల కోసం ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వాటి ప్రయోజనాలను పొందేందుకు న్యాయసలహాలు, సహాయం అందించడం మొదలైన అంశాలపై వివరించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉచిత న్యాయసహాయం, న్యాయ సహాయం రక్షణ సలహా వ్యవస్థను, పారా లీగల్ వాలంటీర్‌లు, లీగల్ ఎయిడ్ క్లినిక్స్ విధి విధానాలు తెలియజేశారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ కడప వారిని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప కేంద్రకారాగారం డిప్యూటీ సూపరింటెండెంట్ జవహర్‌బాబు, వైద్యాధికారి రమేష్, ప్రత్యేక మహిళా కారాగారం ఇన్‌ఛార్జ్ సూపరింటెండెంట్, డిప్యూటీ జైలర్ భువనేశ్వరి, పారాలీగల్ వాలంటీర్‌లు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం

బద్వేలు అర్బన్: మండలంలోని లక్ష్మీపాలెం గ్రామంలో వెలసిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామి వారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం నుంచే భక్తులు ఆలయంలో స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం స్వామి ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు భరద్వాజ్, ఆలయ కమిటీ చైర్మన్ మెంటా అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకున్న అధికారులు

కడప కల్చరల్ : కడప నగరంలోని ఓ దర్గాలో అక్రమ నిర్మాణాలను అధికారులు ఆపివేయడం పట్ల నగరానికి చెందిన ముస్లిం ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల కడప నగరం కొత్త మార్కెట్ వద్దగల హజరత్ సయ్యద్‌షా ఖాసీముద్దీన్‌షా ఖాద్రి సాహెబ్ దర్గా ప్రాంగణంలో ఇటీవల కొందరు వ్యక్తులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టేందుకు యత్నించారని, దానిని ఆ ప్రాంత ముస్లిం ప్రముఖులతోపాటు నగర ముస్లిం ప్రముఖులు గుర్తించి నిర్మాణాలు చేస్తున్న వారికి తమ అభ్యంతరాన్ని తెలిపారన్నారు. ఈ విషయాన్ని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి, అడిషనల్ డిస్ట్రిక్ట్ వక్ఫ్ అధికారి దృష్టికి వెళ్లడంతో వారు వెంటనే స్పందించినట్లు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం అక్రమమని అధికారులు తెలిపారు.

మాతృ మరణాలను నివారించాలి

కడప రూరల్ : మాతృ మరణాల నివారణకు అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలోని తన చాంబర్‌లో డీఎంహెచ్‌ఓ.... ముద్దనూరు, వద్దిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జరిగిన మాతృ మరణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృ మరణాలు జరిగేందుకు గల కారణాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందించిన సేవలు, వైద్య సిబ్బంది ఇంటి వద్ద అందించిన సేవలపై ఆరా తీశారు. రక్తహీనత ద్వారా ఏ తల్లి మరణించరాదన్నారు. రక్తహీనత కలిగిన గర్భవతిని నమోదు చేయాలన్నారు. నమోదు సమయం నుంచి ప్రతినెలా వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ప్రతినెలా 9వ తేదిన జరిగే ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో స్త్రీల వ్యాధి నిపుణుల ద్వారా క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించాలన్నారు. అలాగే ఐరన్‌మాత్రలు, ఐరన్ సుక్రోజ్, పోషకాహారం, అత్యవసర పరిస్థితుల్లో రక్తాన్ని ఎక్కించాలన్నారు. ఈ అంశాలకు సంబంధించి వైద్య సిబ్బంది ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. మాతృ మరణాల నివారణకు వైద్య సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా టీకాల అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, డాక్టర్ నీలిమ, సునీల్, సూర్యప్రకాశ్‌రెడ్డి, స్త్రీల వ్యాధులు, జనరల్ విభాగాధిపతులు డాక్టర్ శాంతికళ, డిప్యూటీ జిల్లా వైద్యాధికారి అరుణ తదితరులు పాల్గొన్నారు.